

# మాగాడు

## - అత్తలూరి విజయలక్ష్మి



*(గత సంచిక తరువాయి)*

19వ భాగం

**వాటర్ కలర్స్ మిక్స్ చేయడం**, ఆయిల్ పెయింటింగ్స్, ఆక్రిలిక్ పెయింటింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వసాగాడు సూర్య. గుణశేఖర్ తో పాటు యాడ్ ఏజెన్సీ లో పని చేస్తూ నెలకి వచ్చే అయిదారు వందల జీతంలో సగం గుణశేఖర్ కి ఇంటి ఖర్చులకు, సగం నాకు కావలసిన పేపర్స్, కలర్స్ కాన్వాస్లు వగైరా కొనుక్కోడానికి వినియోగిస్తున్నాను. బ్యాంకు లో ఉన్న లక్ష రూపాయలకి వచ్చే వడ్డీ సేవింగ్స్ ఎకౌంటు కి ట్రాన్స్ఫర్ చేయించాడు గుణశేఖర్. ఇప్పుడు సూర్య నా దగ్గర డబ్బులు తీసుకోవడం లేదు. తన దగ్గర ఉన్న కొన్ని పెయింట్స్ కూడా నా కోసమే వాడే స్తున్నాడు. అవి కూడా కొననివ్వడు. నేనే చెప్పకుండా కొన్ని కొని తీసుకుని వెళ్తాను.

అప్పుడప్పుడు బయట నుంచి భోజనం, సూర్యకి కావాల్సిన పకోడీలు, బూందీ లాంటివి కూడా కొంటాను. గుణ ఇంటి నుంచి సూర్య రూమ్ కి ఎక్కువ దూరం ఉండదు. గుణ ఉండే రూమ్ రాణిగంజ్ లో ఉంటుంది. సూర్య రూమ్ కవాడీగూడలో ఒక చిన్న సందులో ఉంటుంది. ఆ దారిలోనే నాకు కావాల్సిన వస్తువులు దొరుకుతాయి. ఒక సైకిల్ కొనుక్కున్నాను. సైకిల్ మీద వెళ్తాను ఎక్కడికైనా. గుణ ఒకరోజు మాత్రమే నేర్పించాడు సైకిల్ తొక్కడం. త్వరగానే నా అంతట నేను తొక్కడం నేర్చేసుకున్నాను కాబట్టి transport ఇబ్బంది లేదు.

నాకు ఆర్ధికంగా కొంత వెసులుబాటుగానే ఉంది. ఆ విషయం చెప్పినా సూర్య నా దగ్గర డబ్బులు తీసుకోకుండానే నా కోసం ప్రతి రోజు సాయంత్రం మూడు గంటల సేపు శిక్షణ ఇస్తున్నాడు. మామూలుగా మాట్లాడేటపుడు ఎంతో సరదాగా ఉండే సూర్య శిక్షణ సమయంలో చాలా సీరియస్ గా ఉంటాడు. కోర్స్ పూర్తీ అయాక ఈ డబ్బు సూర్యకి గురుదక్షిణ కింద ఇవ్వాలి. తనకి మాత్రం ఎక్కడి నుంచి వస్తాయి? పాస్బుక్ ఒకసారి చూసి, లోపల పెట్టేసాను.

సూర్య చిత్రలేఖనంతో పాటు చదువు కూడా చెప్పసాగాడు. త్వరలోనే చిన్న, చిన్న ఇంగ్లీష్ పదాలు మాట్లాడే స్థాయికి తీసుకువచ్చాడు. ఇప్పుడు మునుపటికన్నా ఎంతో మంచి భాష మాట్లాడగలుగుతున్నాను. ఇదివరకు మాటల్లో యాస దొర్లేది. ఇప్పుడు అది పూర్తిగా పోయింది. “గండిపేట నీళ్ళు ఒంటపట్టేసాయి బ్రదర్” అన్నాడు ఒకరోజు సూర్య.

తిరిగి తనే నా భుజం తట్టి “గుడ్ ఇలాగే ఉండాలి. కాలాన్ని బట్టి, వాతావరణాన్ని బట్టి, పరిస్థితులను బట్టి మనలను మనం మార్చుకుంటూ ఉంటేనే ఎత్తుకి ఎదుగుతాము” అన్నాడు.

సూర్య పాఠాలే కాదు, మాటలు కూడా నాకు మంత్రాలే అనిపిస్తాయి. అతను మాట్లాడే ప్రతి అక్షరంలో ఏదో ఒక నిగూఢమైన భావం వినిపిస్తుంది. ఒకోసారి తననే అడుగుతాను ఆ భావం ఏమిటో చెప్పమని.. ఒక్కోసారి నేనే ఆలోచిస్తూ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాను. కానీ ఎంత అర్థం చేసుకున్నా, ఎప్పుడూ ఒక కొత్త పజిల్ లాగే కనిపిస్తాడు.

కాలం నిలడగానే కదులుతోంది.. గుణశేఖర్, సూర్యల స్నేహం లభించడం  నా  అదృష్టం కదా! లేకుంటే ఈ మహానగరంలో మరో ఫుట్ పాత్ బతుకే మొదలయేది. ఇలా ఒక గదిలో నాలుగు గోడల మధ్య, ఒక రూఫ్ కింద ఒక మంచి  మిత్రుడితో కలిసి జీవించే అవకాశం కలుగుతుందని కల్లో కూడా భావించలేదు. మరో మంచి  మిత్రుడు నాలోని కళకి సాన పెట్టి నన్ను ఒక మంచి కళాకారుడు గా తయారు చేయగలడని ఊహించానా!  కళతో పాటు చదువు కూడా చెబుతున్నాడు. పరీక్షలకి కట్టు మహా అని ప్రోద్బలం చేస్తున్నాడు. కానీ చదివినవి గుర్తు పెట్టుకుని, పరీక్షలో చూడకుండా రాయగల శక్తి నాకులేదు.  సర్టిఫికెట్ కేవలం ఉపాధి కోసమేగా!  నేను నా కళ ద్వారా స్వతంత్రంగా జీవిస్తాను.  దానినే ఉపాధిగా ఎంచుకుంటాను” అన్నాను.

“మంచి ఆలోచనే కానీ, సౌఖ్యంగా బతకాలంటే కళ సరిపోదు, శాంతిగా బతకాలంటే చాలు. నువ్వెలా బతకాలని అనుకుంటున్నావు” అనడిగాడు.

నాకు అర్థం కాలేదు. “అంటే!” అన్నాను సందేహంగా.

నవ్వాడు. “నేను కళాకారుడినే కదా! నాకు ఉద్యోగం లేదు. నీలాంటి నలుగురు శిష్యులను చేరదీసి, నా కళ నేర్పిస్తూ, నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నాను. ఆ సంపాదన నా మందు బాటిల్స్ కి, నా తిండికి, ఈ రూమ్ రెంట్ కి సరిపోతుంది. కాళీగా ఉన్నప్పుడు నాకు ఇష్టమైన పాటలు వినడానికి ఈ రేడియో ఒక్కటే నా దగ్గర ఉన్న లగ్జరీ. నేను సుఖంగా ఉన్నట్టా! శాంతిగా ఉన్నట్టా!”

సుఖం, శాంతి ఈ పదాలకు అర్థం తెలిసినా, నిర్వచనం తెలియదు. అందుకే మౌనంగా అతనేం చెబుతాడో అన్నట్టు చూడసాగాను.

“సుఖంగా, శాంతిగా ఉన్నాను. ఇది నా అభిప్రాయం. కానీ, మరెవరన్నా నన్ను చూస్తే, ఏంటిరా నీ బతుకు? ఒక సోఫాలేదు, ఒక టి వి లేదు, ఒక స్కూటర్ లేదు, మంచి బట్టలు లేవు..ఇంత దరిద్రంగా బతుకుతున్నావా! అంటారు. అది వాళ్ళ అభిప్రాయం. నీకు ఏమనిపిస్తుంది? ఈ రెండు అభిప్రాయాల్లో ఏది కరెక్ట్ అనిపిస్తుంది.”

ఆలోచించాను. సూర్య అన్నట్టు అది సౌఖ్యమా, భోగమా! కనీస సౌకర్యాలు అంటే ఏమిటి? ఇప్పుడు సూర్య దగ్గర ఉన్నవి కనీస సౌకర్యాలు కాదా! పడుకోడానికి ఏదో ఒక మంచం ఉంది.. కోర్చోడానికి కుర్చీ ఉంది.. అన్నం తినడానికి కంచం ఉంది. కష్టపడే తత్త్వం ఉంది. అన్నిటికీ మించి మంచి మనసుంది. ఇవి చాలవా బతకడానికి.

సూర్య నా భుజం మీద చేయేసి ఆప్యాయంగా నొక్కాడు. "మహా! జీవితం పట్ల ప్రతి మనిషికీ వారి, వారి అభిరుచులను బట్టి అనేక రకాల అభిప్రాయాలు, ఆశలు ఉంటాయి. ఇదే మంచిది, ఇదే కరెక్ట్ అని చెప్పడం కష్టం. నీకు నీ కళతో బతకగలనన్న నమ్మకం ఉంటే బతికేస్తావు."

నాకు ఎవరి దగ్గరైనా పని చేయాలంటే భయం. నాకేమి తెలియదు. తెలియకుండా ఎవరి దగ్గరో పని చేస్తూ వాళ్ళ ఆగ్రహానికి గురి అవుతూ, అడుగడుగునా అవమానాలు భరిస్తూ బతకడం నాకు కష్టం సూర్యా! మూడు పూటలా తిండి, తలదాచుకోడానికి నీడ, నీ ప్రేమ, గుణ ఆదరణ ఇవి చాలు" అన్నాను గాద్గాదికంగా.

" జీవితం ఎమోషన్ కాదు మహా! ఎమోషన్స్ తో నిర్ణయాలు తీసుకోకు. అయినా, ఇంకా నీకు టైం ఉంది అవన్నీ ఆలోచించడానికి. ఈరోజు ఆనందంగా ఉన్నామా అని సంతోషించు..రేపటి గురించి ఆలోచించకు. పడుకో" అన్నాడు. అప్పటికే కొంచెం ఎక్కువే తీసుకున్నాడు డ్రింక్. అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. నేను కూడా ఆరోజు సూర్య గదిలోనే పడుకున్నాను.

సూర్య నిజానికి చూడ్డానికి ఆకర్షణీయంగా ఉంటాడు. కానీ చాలా నిర్లక్ష్యంగా ఉంటాడు. చాలా వత్తుగా, రింగులు తిరిగి ఉంటుంది క్రాఫ్. ఏనాడూ చిటికెడు నూనె కూడా రాయడం నేను చూడలేదు. రాయను అని చెప్పాడు కూడా. రోజూ తలస్నానం చేసి, కుడి చేతి వ్రేళ్ళతో పైకి సర్దుకుంటాడు కానీ దువ్వెనతో దువ్వుకోడు. ఎప్పుడూ గడ్డం పెరిగి ఉంటుంది. అప్పుడప్పుడు ఆ గడ్డాన్ని షేపు చేయిస్తాడు. రోజూ ఉతికిన ప్యాంట్, చొక్కా తోడుక్కుంటాడు. తన బట్టలు తనే ఉతుక్కుంటాడు. ఎక్కువగా బ్రెడ్ టోస్ట్ చేసుకుని తింటాడు. వంట చేసుకోడు. అన్నం తినాలి అనిపిస్తే అతని ఇంటికి దగ్గరలో ఒక ఉడిపి హోటల్ ఉంది అక్కడ తినేస్తాడు. నెలకి ఇంత అని ఇస్తాడు హోటల్ ప్రొప్రయిటర్ కి. ఎప్పుడూ హిందీ పాటలు కూనిరాగం తీస్తూ ఉంటాడు. నవ్వుతూ, చలాకీగా ఉన్నట్టు కనిపిస్తున్నా, కళ్ళ చివర ఏదో విషాదం లీలామాత్రంగా కదులుతూ ఉండేది. తన పరిధిలో ఎవరికి , ఎలాంటి సహాయం కావాలన్నా ముందు ఉంటాడు. తన దగ్గర పదిరూపాయలు ఉంటే, ఐదు తనకి, ఐదు ప్రజలకి అన్నట్టు ఉండేవాడు. మొత్తానికి సూర్య స్నేహం నాలో నాకే తెలియని ఒక కొత్త వ్యక్తిని వెలికి తీస్తున్నట్టు అనిపించసాగింది.

అప్పుడప్పుడు గుణశేఖర్ తో కలిసి ముగ్గురం షికారు వెళ్తుంటాం. వాళ్ళిద్దరూ అనేక విషయాలు కలబోసుకుంటారు. వాటిలో నాటి రాజకీయాలు, సినిమాలు ప్రధానంగా ఉండేవి. సూర్య హిందీ పాటల గురించి మాట్లాడుతూ, వాటి అర్థాలు చెబుతూ ఉండేవాడు. నాకు హిందీ రాకపోయినా, తను చెబుతుంటే ఆసక్తిగా వినేవాడిని. నెమ్మదిగా నాకూ హిందీ పాటల మీద అనురక్తి మొదలైంది. నాకో చిన్న రేడియో కొనిచ్చాడు సూర్య. అప్పుడప్పుడు సంగీత థియేటర్ లో ఇంగ్లీష్, హిందీ సినిమాలు చూపించేవాడు.

ఒకరోజు ట్యాంక్ బండిమీదకితీసుకుని వెళ్ళారు ఇద్దరూ నన్ను. అక్కడ నెమ్మదిగా ప్రవహిస్తున్న ఆ విశాలమైన నది..చుట్టు పక్కల ప్లాట్ ఫారం మీద రక,రకాల బొమ్మలు, ఆహారపదార్థాలు అమ్ముకునే చిన్న, చిన్న వ్యాపారస్తులు, ఏకాంతం వెతుక్కుని ఏ చెట్టు చాటునో కూర్చుని, యవ్వనాన్ని ఎంజాయ్ చేసే జంటలు, పిల్లలతో ఆటలాడుతూ ఉల్లాసంగా తిరిగే భార్యాభర్తలు, వంటరిగా వచ్చే వాళ్ళు, మాలాంటి స్నేహితులు ఇలా ఆ పరిసరాలు ఉత్సాహంతో, ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది.

కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న పిల్లలని చూస్తూ అన్నాడు సూర్య" నిజంగా బాల్యం అనేది ఎంత మధురమైనది! బతుకు తెరువు గురించి ఆరాటాలు, వర్తమాన జీవనపోరాటాలు, భవిష్యత్తు గురించిన భయాలు, ఏమి ఉండవు.. గతం తాలూకు వ్యధలు అసలే ఉండవు.. ఆకాశంలో హాయిగా ఎగిరే గాలిపటం బాల్యం. నా కంటూ బాల్యంలో ఎలాంటి మధురమైన జ్ఞాపకాలు లేవు.. మీకేమన్నా ఉన్నాయా!" అడిగాడు సూర్య నన్ను, గుణని చూస్తూ.

గుణ నవ్వాడు. "నా స్థాయికి తగిన మిత్రులు నాకూ ఉండేవాళ్ళు. చెట్లెక్కడం, దెబ్బలు తగిలించుకోవడం, అందరిళ్ళల్లో జామకాయలు తెంపుకుని వాటితో పాటు దెబ్బలు కూడా తినడం ఇలాంటివే ఉన్నాయి. "

నేను మాట్లాడలేదు. కళ్ళల్లో తిరుగుతున్న నీళ్ళు చెంపల మీదకి జారితే వాళ్ళు చూస్తారని కొంచెం దూరంలో మొక్కజొన్న కండెలు కాలుస్తున్న స్త్రీ దగ్గరకు వెళ్లి మూడు కండేలు కొనుక్కొచ్చాను. అవి తింటూ ఉంటే సింహాచలం గుర్తొచ్చింది. ఆమెగుర్తుకు రాగానే నా చిన్నతనం, అమ్మ, నాన్న, తుపాను భీభత్సం, కెరటాలు లాగేసిన నా సైకత శిల్పాలు అన్నీ గుర్తొచ్చి, మనసంతా వేదనతో నిండిపోయింది. అమ్మ జన్మనిచ్చింది.. సింహాచలం మరో జన్మ ఇచ్చింది.

ఆ రోజు భయంతో అమ్మ వెచ్చని గుండెల్లో ముడుచుకుని ఉన్న నన్ను ఏవో అదృశ్యహస్తాలు అమ్మ నుంచి దూరంగా విసిరేసి, ఆవిడని ఎత్తుకుని వెళ్ళిపోయినట్టు మాయం అయిపోయింది.

పూలదండల్లాంటి చేతులతో చుట్టేసి, తన గుండెలో దాచుకున్న అమ్మ వెచ్చని స్పర్శ ఇంకా అలాగే ఉంది. అమ్మ ఎక్కడికి వెళ్లిందో తెలియదు. గుడిసెలో వెతికాను .. ఇసకలో వెతికాను, కెరటాల్లో వెతికాను, మేఘాల్లో వెతికాను. ప్రతి

చీర కొంగులో అమ్మకోసం వెతుక్కున్నాను.  సింహాచలం అమ్మలాగే ఆదరించింది.. అమ్మలాగే పిలిచింది.. అమ్మలాగే తిండి, నీళ్ళు ఇచ్చింది. సింహాచలం కూడా నేను చూస్తూ ఉండగా, నా కళ్ళ ఎదురుగానే నిర్జీవం అయింది. ఎందుకిలా అయింది?

" ఏమైందిమహా " గుణశేఖర్ ప్రశ్నతో త్రుళ్ళిపడ్డాను. ఆలోచనల నుంచి తేరుకుని తల అడ్డంగా ఆడిస్తూ "అమ్మ నీడలో పెరగడానికికూడా అదృష్టం ఉండాలి కదూ!" అన్నాను.

గుణశేఖర్ నా భుజం ఆప్యాయంగా తట్టి " లేని దాన్ని గురించి ఆలోచించకు ! దుఃఖం ఎక్కువ అవుతుంది.. ఉన్న దానితో తృప్తి పడదాం" అన్నాడు.

" బాల్యంలో మధురస్మృతులు ఉంటే తలచుకో.. లేవని విచారించకు" అన్నాడు సూర్య.

నేనేమి మాట్లాడలేదు. మొక్కజొన్న కండె కొరుకుతూ, ఏకాంతంగా ఒకరినొకరు హత్తుకుని కూర్చున్న జంటలను చూస్తూ అన్నాడు సూర్య. "వీళ్ళెంత మూర్ఖులు, జీవితంలో అతి ముఖ్యమైన దశని ఇలాంటి ఆకర్షణలతో, ప్రలోభాలతో వృధా చేస్తుంటారు. అసలు ప్రేమ మీద నాకు నమ్మకం లేదు.. నీకుందా" నన్ను, గుణని ఉద్దేశించి అడిగాడు సూర్య.

గుణ నవ్వి "ప్రేమ లేకుంటే బతుకేడిది భయ్యా" అన్నాడు.

సూర్య నీ అభిప్రాయం ఏమిటి అన్నట్టు నా వైపు చూసాడు.

"నాకింకా అనుభవంలోకి రాలేదు కదా" అన్నాను.

"వచ్చినా స్వీకరించకు. ఎవరన్నా అమ్మాయి నిన్ను ప్రేమిస్తున్నా అని చెప్తే మాత్రం నమ్మకు.. ఎవరూ ఎవరినీ ప్రేమించరు.. అంతా ట్రాష్.. వట్టి హంబగ్ .. అది ప్రేమ కాదు అవసరం. నీతో అవసరం ఉంటే నీ మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకుని వస్తుంది. నీతో అవసరం తీరాక ఆ ప్రేమకి రెక్కలొస్తాయి. ఎగిరిపోయి, మరో కొమ్మ మీద వాలుతుంది. ఈలోగా మన జీవితం మటాష్ " అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ.

నేను నవ్వేసి ఊరుకున్నాను. గుణ మాత్రం సూర్యని సూటిగా చూస్తూ "నీ మాటలని బట్టి నువ్వు ప్రేమలో ఫెయిల్ అయినావు అనిపిస్తుంది.. ఎవరు భయ్యా ఆ పిచ్చి అమ్మాయి."అనడిగాడు.

సూర్య మాట్లాడలేదు. రైలింగ్ మీద ఒక కాలు పెట్టి, కొంచం ఒంగి చిన్నగా, గుండ్రంగా తిరుగుతున్న నీటిలోని సుడులు చూస్తూ" జీవితం అనేది ఒక పెద్ద సముద్రం అయితే, ప్రేమ, ప్రేయసి ఇవి సుడిగుండాలు. మనలను మడతపెట్టి తనలోకి లాగి నిలువునా ముంచేస్తాయి. అందుకే ప్రేమించకు..ఎప్పటికీ ప్రేమించకు."

మరికొంత కాలం గడిచింది. చేయి తిరిగిన చిత్రకారులకి తీసిపోని విధంగా నన్ను తయారు చేయడానికి కృషి చేస్తున్నాడు సూర్య.

ఆరోజు నన్ను ప్రత్యేకంగా తన గదికి పిలిచి చెప్పాడు సూర్య.. " కళాభవన్ లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఉంది. నీ చిత్రాలు ప్రదర్శనకి పెడదాము.. నా మిత్రుడే కండక్ట్ చేస్తున్నాడు ఆ ప్రదర్శన. రెండు రోజులు ఉంటుంది. దాని కోసం ఒక చిత్రం ప్రత్యేకంగా వేసి తీసుకురా."

" నేనా! అప్పుడేనా! ఇంకా నేర్చుకుంటున్నాను కదా! అంత బాగా వేయగలనా !ప్రదర్శనకి అంటే చాలా పెద్ద, పెద్ద వాళ్ళవి ఉంటాయి కదా! " అన్నాను విస్మయంగా .

సూర్య నవ్వాడు. "ముందు చిన్నగా ఉన్నవాళ్ళే పెద్దవాళ్ళు అవుతారు. ఇది ప్రారంభం. ఇలాంటి ప్రదర్శనలు అనేకం జరుగుతాయి.. ఇంక నువ్వు ఇలాంటి వాటిలో పాల్గొనాలి. లేకపోతే ఎలా ఎదుగుతావు? మహా " చటుక్కున ఆగిపోయి నా వైపు నిశితంగా చూస్తూ అన్నాడు " నీ పేరు అసంపూర్ణంగా ఉంది. దానికి ముందు, వెనక ఏదన్నా ఉండాలి. అంటే రావు, శాస్త్రి, రెడ్డి, చౌదరి, గౌడ ఇలా ఏదో ఒకటి.." ఆలోచిస్తూ అన్నాడు "ఒకే ఇప్పటి నుంచి నా పేరులో సగం నీకు ఇస్తున్నాను. నీ పేరు ఈ రోజు నుంచీ మహాతేజ. ఓకేనా" నేను నిశ్చేష్టుడి నై చూస్తూ ఉండిపోయాను." మహాతేజ అనబడే పెద్ద ఆర్టిస్ట్ పుట్టాడు, పెరిగాడు మనలోనే ఉన్నాడు అని ఈ ప్రజలకి, సమాజానికి ఎలా తెలుస్తుంది?"

నా గుండెల్లో సప్తసముద్రాలు పొంగాయి. కళ్ళు చెమ్మగిల్లాయి అతని ఆత్మీయతకి . అతణ్ణి కౌగలించుకుని " ఎక్కడినుంచి వచ్చావు సూర్యా! నీకు, నాకు ఈ బంధం ఏనాటిది?" అన్నాను. .

సూర్య నా వీపు మీద చేయి వేసి నిమిరాడు. ఆ స్పర్శలో ఎన్నో అర్థాలు, మరెన్నో భావాలు"ఇప్పటి నుంచీ నిన్ను నేను తేజా! అని పిలుస్తాను" అన్నాడు మనస్ఫూర్తిగా.

సూర్య ఇచ్చిన ప్రోత్సాహంతో ఒక రాత్రి, ఒక పగలు కూర్చుని ఒక కొత్త బొమ్మ వేసి తీసుకుని సూర్య దగ్గరకు వెళ్లాను.

పదేళ్ళ పిల్లాడు తను వేసిన మొట్టమొదటి డ్రాయింగ్ చూపించి టీచర్ అభినందన కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్టు చూసాను సూర్యవైపు.

చిరునవ్వుతో రోల్ చేసిన కాన్వాస్ తెరిచిన సూర్య విభ్రమంతో చూస్తూ ఉండిపోయాడు. అతని నోటినుంచి ఎలాంటి శబ్దం రాలేదు.. చేష్టలుడిగి అలా చూస్తూ ఉండిపోయాడు. సూర్య మోహంలోకే తదేకంగా చూస్తున్న నా గుండె కొట్టుకోసాగింది.. ఏదన్నా తప్పు చేశానా ! అనుకుంటూ ఊపిరి బిగబట్టి చూడసాగాను.

సూర్య నెమ్మదిగా తల తిప్పి నా వైపు చూసి " తేజా! నీ గురించి నువ్వు ఇంత నిశ్శబ్దంగా చెప్పుకోవడం ఎలా నేర్చుకున్నావు? దీన్ని expressionism అంటారు ... కేవలం గీతలతో ఒక జీవితాన్ని ఆవిష్కరించడం మామూలు విషయం కాదు. మై డియర్..యు ఆర్ గ్రేట్" నన్ను గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు.

ఇంద్రధనుస్సు లోని రంగులన్నీ నా మీద వెదజల్లుతున్నట్టు అనిపించింది .

"నిజంగా బాగుందా " అన్నాను అపనమ్మకంగా .

" ఇంతకన్నా గొప్పగా చెప్పలేను తేజా నా ఆనందాన్ని.. నాకు నువ్విచ్చిన గురుదక్షిణ ఇదే."

చదివేసిన పుస్తకం పుటలు తిప్పేస్తున్నట్టు, విరిగిపడుతున్న కెరటాలు చూస్తూ, గతానికి, వర్తమానానికి కట్టిన వారధి మీద నిలబడి భవిష్యత్తు వైపు ప్రశ్నార్ధకంగా చూస్తున్న ఒక యువకుడు.. అతని తల మీద నీలాకాశం. పాదాల దగ్గర మహాసముద్రం..చుట్టూ ఏకాంతం. పల్టీలు కొడుతూ గమ్యం వెతుక్కుంటున్న ఒకే ఒక పక్షి. అదే ప్రదర్శనకి నేను కొత్తగా వేసిన చిత్రం. సూర్య శిక్షణలో నేను నేర్చుకున్న కొత్త పద్ధతిలో వేసిన చిత్రం.

సూర్యతో పాటు కళాభవన లో అడుగుపెడుతుంటే రక్తప్రసరణ తీవ్రం అయి, ఉద్వేగంతో వణికిపోయాను . ఎందఱో గొప్ప చిత్రకారుల చిత్రాల మధ్య నేను వేసిన చిత్రం . మొదటిసారి చంద్రకాంత్ ప్రోత్సాహంతో, విశాఖపట్నంలో జరిగిన చిత్రప్రదర్శన లో ప్రదర్శించిన గాంధీ బొమ్మ విదేశీయుడు కొనడం గుర్తు వచ్చింది. ఆరోజు కొండంత అండగా చంద్రకాంత్ గారు.. ఇవాళ విశ్వమంత ప్రేమ చూపించే సూర్య..

" ఇక్కడ మన చిత్రాలు ప్రదర్శన మాత్రమే. ఎవరన్నా కొంటాను అంటే ఇవ్వకు. తరవాత ఇదే చిత్రం పోటీకి పంపుదువుగాని తప్పకుండా బహుమతి వస్తుంది.. నాకు నమ్మకం ఉంది" అన్నాడు సూర్య.

నేను అసలు ఏమి ఆలోచించడం లేదు. నా చిత్రం చూసే ప్రజల కళ్ళల్లో కదిలే భావాలు చదవడానికి ఎదురుచూస్తున్నాను. సూర్య అన్నట్టే రెండురోజుల పాటు జరిగిన ఆ ప్రదర్శనలో అనేక మంది ప్రముఖ, వర్ధమాన చిత్రకారుల చిత్రాల ప్రదర్శన జరిగింది. కొందరు శిల్పాలు కూడా ప్రదర్శించారు.

ఆఖరి రోజు, ఆఖరి గంట.. మరో గంటలో ప్రదర్శనా గడువు పూర్తి అవుతుంది. నేను, సూర్య కారిడార్ లో నిలబడి ఉన్నాము.  లోపల గ్యాలరీలో చిత్రకళ మీద అభిమానంతో వచ్చిన ప్రేక్షకులు ఒక్కో చిత్రం చూస్తూ నెమ్మదిగా నడుస్తున్నారు.

సూర్య స్నేహితుడు, ఆ ప్రదర్శన నిర్వాహకుడు వంశీ మా  దగ్గరగా వచ్చాడు. సూర్యకి షేక్ హ్యాండ్  ఇచ్చి  వచ్చి అన్నాడు. " సూర్యా! just excellent. నీ శిష్యుడు చాలా పెద్ద చిత్రకారుడు అవుతాడు భవిష్యత్తులో. అందరి కళ్ళు అతని చిత్రం మీదే. బెంగుళూరులో జాతీయ స్థాయి ప్రదర్శన జరుగబోతోంది.  వెంటనే ఎంట్రీ ఇవ్వు.. తప్పకుండా బహుమతి వస్తుంది.  ఐ బిలీవ్" అన్నాడు.

సూర్య చిరునవ్వుతో నా వైపు చూసాడు. నేను ఉక్కిరిబిక్కిరి అయాను. సూర్యవైపు ప్రశ్నార్ధకంగా చూస్తూ నిలబడిపోయాను.

"నన్ను చూస్తావేం తేజా! చెప్పు నీకు ఒకే నా" అన్నాడు.  నాకేం చెప్పాలో అర్ధం కాలేదు.

సూర్య "తేజా! పెద్దవాడివి అవుతున్నావు. స్వయం నిర్ణయాలు తీసుకోడం నేర్చుకో.  నీ మీద నీకు  నమ్మకం, నీ ప్రతిభ పట్ల విశ్వాసం ఉండాలి.  బహుమతి వచ్చినా, రాకపోయినా స్పోర్టివ్ గా తీసుకునే ఆత్మబలం ఉండాలి. మన work ప్రదర్శనకి పెట్టడం ఎందుకంటే మన గురించి నలుగురికీ తెలియచేయడం కోసం. నలుగురితో మనకి పరిచయాలు కలగడం కోసం. బెంగుళూరు వెళ్లి ప్రదర్శనలో పాల్గొంటే నీకు కొత్త అనుభవం కలుగుతుంది.  ధైర్యం వస్తుంది. "

అతని మాటలు పూర్తికాకుండానే గబా,గబా అన్నాను "వెళ్తాను. ఎంట్రీ పంపిద్దాం."

"గుడ్ " నా భుజం తట్టాడు. వంశీ వైపు చూసి, విన్నావుగా" అన్నాడు.

వంశీ చిరునవ్వుతో "ఓ కే ఆ ఏర్పాట్లు చేద్దాం"  అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళాక అడిగాను "నువ్వెందుకు నీ చిత్రాలు ప్రదర్శించవు? నువ్వు కూడా బెంగుళూరు రావచ్చు కదా!"

సూర్య బాటిల్ మూత తెరిచి గ్లాసులో విస్కీ పోసుకుంటూ నవ్వాడు.

" నేను నమ్ముకున్న, నన్ను నమ్ముకున్న కళ చిత్రకళ.  దీనిలో శిక్షణ ఇస్తూ, నా వారసులను తయారు చేస్తాను. అదికూడా నేను బతకడానికి నేను ఎంచుకున్న ఉపాధి మార్గంకాబట్టి. నాకు కొత్తగా ఎవరి ప్రశంసలు, బహుమతులు ఇష్టం లేదు. నువ్వు చూస్తున్నావుగా!  నాకంటూ విలువైన వస్తువులు, బ్యాంక్ లో బాలన్స్, ఆస్తులు ఏమి లేవు. అవన్నీ

సంపాదించుకుని నేనేం చేయాలి? నాకెవరూ లేరు విల్లు రాసివ్వడానికి. అలాగే కీర్తి కూడా నాకు అవసరం లేదు. అపకీర్తి రాకుండా ఉంటే చాలు.”

“నాకు మాత్రం ఎవరున్నారు సూర్యా!నన్నెందుకు ప్రోత్సహిస్తున్నావు?”

“నీకు భవిష్యత్తు ఉంది.. నాకు కేవలం వర్తమానమే ఉంది”.

“అదే భవిష్యత్తు నీకూ ఉంటుందిగా! నువ్వూ పెళ్లి చేసుకుని పిల్లలని కంటే నీకంటూ ఒక కుటుంబం ఏర్పడుతుంది కదా!”

“పెళ్ళా!” ఒక గుక్క తాగి, ఫక్కున నవ్వాడు. “ఈ క్షణం మాత్రమే నాది, మరో క్షణం ఏమవుతానో అనే సంశయంతో బతికే నేను పెళ్లి చేసుకుని ఏం చేయాలి?”

సూర్య చిన్న కళ్ళల్లో, నుదుటి మీద నుంచి కళ్ళ మీదకి పడుతున్న క్రాఫ్ మధ్యలో నుంచి, కొట్టిచ్చినట్టు కనిపించిన బాధ నా గుండెని తాకింది.

“సూర్యా! నువ్వేమి అనుకోకపోతే ఒక విషయం అడగనా!”

గ్లాసు పెదాల దగ్గర పట్టుకుని, నా వైపు చూడకుండా “అడుగు” అన్నట్టు తలాడించాడు.

“నువ్వెందుకు జీవితం పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటావు.”

సూర్య నా వైపు చూసాడు. “ఇంతకన్నా వేరుగా ఎలా బతకాలో నాకు తెలియదు. ఎవరూ నేర్పలేదు”

“బతకడం ఎవరు నేర్పిస్తారు?.”

అవును అన్నట్టు మొహం, కిందకీ, పైకి ఆడించి “నిజమే! ఈ బతుకుమాత్రం ఎవరు నేర్పారు? బహుశా కాలమే నేర్పింది అనుకుంటా. ఇంకా కొంతకాలం బతికి ఉంటే ఇంకా బాగా బతకడం నేర్పిస్తుందేమో”అన్నాడు.

నేను కలవరపడ్డాను. “అదేం మాట సూర్యా! అలా విరక్తిగా ఎందుకు మాట్లాడతావు?”

“నీకిది విరక్తిగా మాట్లాడినట్టు అనిపిస్తోందా? నాకు ప్రాక్టికల్ గా అనిపిస్తోంది” అని గ్లాసు ఎత్తి మిగిలినది తాగేసి, మరి కొంచెం పోసుకున్నాడు.

బాధగా అనిపించింది. విషం అని తెలిసీ ఎందుకు తాగుతున్నాడు? సూర్యకి అన్నీ తెలుసు. అజ్ఞాని కాదు. “ఎందుకు నిన్ను నువ్వు హింసించుకుంటున్నావు? సూర్యా నువ్వు ఎవరినన్నా ప్రేమించావా!” అడిగాను.

సూర్య మాట్లాడ లేదు. మార్దవంగా అడిగాను. "నాకు చెప్పకూడదా!"

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరవాత కూర్చున్న దగ్గర నుంచి లేచి కిటికీ దగ్గరగా వెళ్లి కర్టెన్ సరిచేసాడు. తిరిగి వచ్చి కూర్చున్నాడు. కొన్ని క్షణాలు అలాగే కూర్చుని లేచి కిచెన్ వైపు వెళ్ళాడు. అతని వాలకం చూస్తుంటే చాలా అస్థిమితంగా ఉన్నట్టు అనిపిస్తోంది. ఆందోళన కూడా మొహంలో కొట్టొచ్చినట్టు కనిపించింది.

గబుక్కున అన్నాడు."ప్రేమించాను. నాకు అర్హత లేకపోయినా ప్రేమించాను. అందుకు దారుణమైన శిక్ష అనుభవించాను. ఎవరిని ప్రేమించాను? ఆ ప్రేమ ఎందుకు విఫలం అయింది చెప్పాలంటే నా కథ చెప్పాలి."

నేను ఊపిరి బిగబట్టి వినసాగాను.

"నేను ఒక తల్లి గర్భం నుంచే పుట్టాను. కానీ, తండ్రి ఎవరు అని ప్రశ్నిస్తాను అనుకుందేమో ఆ తల్లి జవాబు చెప్పలేక కృష్ణలో దూకింది. కానీ, తల్లి,తండ్రి పేర్లు చెప్పలేని నేను ఎక్కడ దూకాలో, ఎక్కడ తేలాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నాను. , తేజా! నిత్యం ఈ ప్రపంచంలో ఎన్నో వింతలు, అద్భుతాలు జరుగుతూ ఉంటాయి. కొన్ని బయటకు వస్తాయి. కొన్ని రెండో కంటికి తెలియకుండా కనుమరుగు అవుతాయి. నా విషయంలో అదే జరిగింది. ఒక అద్భుతం జరిగింది. సాధారణంగా చెత్తకుండీలో నానా చెత్తా వేస్తారు.. పాత డబ్బాలు, విరిగిపోయిన సీసా ముక్కలు, మిగిలిన, అన్నం, పప్పు, కూరలు, రకరకాలు. అవి ఏవి కూడా నా బుల్లి ప్రాణం తీయలేక పోయాయి. బతికి ఉన్నానని అందరికీ చాటేలా గుక్కపట్టేలా ఏడుస్తుంటే, రెండు చిన్నారి చేతులు నన్ను తన భుజం మీద వేసుకుని తన తల్లి దగ్గరకి తీసుకువెళ్ళాయి. ఆ చిన్నారి పేరు రేణుక .

ఎక్కడి నుంచో వలస వచ్చి ఫుట్ పాత్ మీద బతుకుతున్న కుటుంబం. ఆ కుటుంబం లో ఉన్న ఆరుగురిలో ఏడో మెంబెర్ గా నన్ను చేర్చుకున్నారు. నాతోపాటు , మరి ఇద్దరు చిన్నారులను, చెట్టుకి చీరతో ఉయ్యాలలా కట్టి ఊపుతూ పెంచింది ఆ తల్లి. వాళ్ళు అన్నం తింటే అన్నం, రొట్టె తింటే రొట్టె. ఆ చుట్టు పక్కల ఎక్కడన్నా, విందులు వినోదాలు అయితే, రక,రకాల స్వీట్లు, బిరియానీలు, పులిహోరలు పండగ భోజనం పెడుతూ, మూడేళ్ళు పెంచింది ఆ తల్లి. ఈ లోగా అక్కడ వేస్తున్న రోడ్డుపని అయిపొయింది.. మరో చోటికి మరికొన్ని రోజులు బతకడానికి వెళ్ళాలి. నన్ను ఏం చేయాలో అని ఆలోచన వచ్చింది పోలయ్యకి . మనకే నిలకడ లేదు.. ఊరూరూ, వాడ,వాడా తిరిగే మనం ఈ పిల్లాడిని కూడా తిప్పడం సబబేనా అని భార్యా,భర్తలు ఆలోచించుకున్నారు. "అన్నని కూడా మనతోనే తీస్కబోదం నాయనా అంది అక్క బాల.. అవును నాయనా తమ్ముని మనతోనే తీస్కబోదము అంది రేణుక. వాళ్లతోపాటే మరో ప్రదేశానికి రైలెక్కాను. అది ఏ స్టేషనో తెలియదు. మంచినీళ్ళ కోసం, నేను, రేణుక రైలు దిగి ఎదురుగా కనిపిస్తున్న పంపు దగ్గరకు వెళ్ళి కడుపునిండా

నీళ్ళు తాగాము. చల్లని ఆ నీళ్ళు మొహాల మీద చల్లుకున్నాము. ఒక ప్లాస్టిక్ బాటిల్ లో నిండా నీళ్ళు నింపుకున్నాము. రైలు కూత వేసింది. ఆ కూత నేను బయలుదేరుతున్నాను అని చెప్పడం అని తెలియని నేను, రేణుకా నెమ్మదిగా టాప్ ఆపేసి వెనక్కి తిరిగి రైలు వైపు నదుస్తూ ఉన్నాము. రైలు మెల్లగా కదిలింది. పోలయ్య తలుపు దగ్గరకు వచ్చి చేతులు ఊపుతూ, " రాండి రాండి ఉరికి రాండి" అంటూ అరుస్తున్నాడు. రైలు శబ్దం చేస్తూ వేగం పెంచింది. మేము పరిగెత్తాము. రైలు మాకన్నా వేగంగా పరిగెత్తింది. రైలు గెలిచింది. మేము ఓడిపోయాము." సూర్య చెప్పడం ఆపాడు.

"ఆ తరవాత ఏం జరిగింది?" ఆత్రుతగా అడిగాను.

ఇద్దరం గట్టిగా నాన్నా, అమ్మా అంటూ ఏడుస్తూ కూర్చున్నాం. అది చాలా చిన్న స్టేషన్. జనం పల్చగా ఉన్నారు. గోలీసోడా కొట్టుకుని బతికే తిరుపతి ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాడు. చల్లని సోడా ఇచ్చాడు. ఏడవకండి. మీ అమ్మా, నాన్నా వస్తారు. ఇక్కడే నా దగ్గరే ఉండండి. రేపో, ఎల్లుండో వస్తారు మీ కోసం అన్నాడు. వాళ్ళింటికి తీసుకుని వెళ్ళాడు. అమ్మా, నాన్నా రాలేదు. రేణుక వాళ్ళింట్లో పనిమనిషి అయింది. నేను అతని కొట్టులో హెల్పర్ అయాను. రోజులు, వారాలు, నెలలు గడిచాయి. రేణుక వయసుకి మించిన పనితో జబ్బుపడి చనిపోయింది. చెత్త కుండీలో పడి ఉన్న నన్ను చిన్నారి చేతులతో ఎత్తుకుని తీసుకుని వెళ్లి నేనీ లోకాన్ని చూడడానికి దోహదపడిన అక్క ..నేనంటే ప్రాణం పెట్టె అక్క, నాకెంతో ప్రాణం అయిన అక్క ఇంక లేదు.. ఎప్పటికీ రాదు. ఈ వాస్తవం జీర్ణం అయ్యాక నాకు అక్కడ ఉండాలని అనిపించలేదు. అప్పుడు నా వయసు ఏడేళ్ళు. మిగతా అక్కలను, తమ్ముళ్ళను, దేవుడిచ్చిన అమ్మ, నాన్నలను వెతుక్కుంటూ కనిపించిన రైలెక్కాను. ఎక్కడ దిగానో, అది ఏ స్టేషనో తెలియదు. అదే లాస్ట్ స్టేషన్ అని దింపేశారు.

ప్లాట్ఫారం మీద ఏడుస్తూ కూర్చున్నాను. ఆకలి, దాహం, భయం, దిగులు.. ఒక దయామయుడు నన్ను చూసాడు. వివరాలు అడిగాడు. తనతో తీసుకుని వెళ్ళాడు. అక్కడ నా కొత్త జీవితం ప్రారంభం అయింది. ఆయనకీ పెళ్లి కాలేదు..ఆహా, చేసుకోలేదు. గడ్డం, మీసాలు లేని స్వామీజీ. ఆయన పేరు పరమహంస. ఒక్కడే ఉండేవాడు. ఆయనే వంట చేసేవాడు. ఆయన దగ్గర ఎన్నో పుస్తకాలు. రామాయణం, భారతం, భాగవతం, వివేకానందుడి ఉపన్యాసాలు, మరెన్నో గ్రంధాలు. ఎప్పుడూ చదువుకుంటూ, లేదా బొమ్మలు గీసుకుంటూ ఉండేవాడు. నెమ్మదిగా నాకు కూడా చదువు చెప్పడం, బొమ్మలు గీయడం నేర్పడం మొదలుపెట్టాడు. నేను ఆయనని స్వామీ! అని పిలిచేవాడిని.

రోజూ ఉదయం నిద్ర లేచి ఇల్లంతా శుభ్రం చేయడం, ఆయన చదివి టేబుల్ మీద వదిలేసిన పుస్తకాలు రాక్స్ లో సర్దడం, వంట చేస్తుంటే సాయం చేయడం, గిన్నెలు కడగడం ఇలా ఆయనకీ నేను కుడిభుజం అయ్యాను.

ఒకరోజు నన్ను ఒక ఆశ్రమం లాంటి స్కూల్ కి తీసుకుని వెళ్ళారు. అది గురుకులం. అక్కడ నన్ను ఒక గురువుగారికి అప్పచెప్పి, "ఇక్కడే ఉండి బాగా చదువుకో. మంచి భవిష్యత్తు ఉంటుంది. నేర్చుకున్నవి మర్చిపోకుండా ప్రాక్టీసు చేస్తూ ఉండు. నా దగ్గర ఎక్కువ కాలం ఉంటే నీకు భవిష్యత్తు ఉండదు" అని నాకు ధైర్యం చెప్పి వెళ్ళిపోయారు. నేను గుండె పగిలేలా ఏడ్చాను. కానీ ఆయన సర్వసంగ పరిత్యాగి. నువ్వు ఆయనకీ ఒక కొత్త బాధ్యత. ఆ బాధ్యత ఆయన ఎక్కువకాలం మోయలేరు. ఇక్కడ నీకు ఏ లోటూ ఉండదు. నాతొ రా" అంటూ ఆశ్రమం లోపలికి తీసుకుని వెళ్ళారు గురువుగారు.

అక్కడే స్కూల్ ఫైనల్ దాకా చదువుకున్నాను. స్వామీజీ దగ్గర నేర్చుకున్న చిత్రకళకి నా సృజనాత్మకత జోడించి ఆ కళను ఇంప్రూవ్ చేసుకున్నాను. ఆశ్రమం వాళ్ళదే డిగ్రీ కాలేజి కూడా ఉంది. అక్కడ నా బి.కాం పూర్తీ చేసాను. రెక్కలు ఇవ్వడం వరకే వాళ్ళ బాధ్యత.. ఎగిరిపోవడం మా నిర్ణయం. నేనూ ఒక ఉద్యోగం చూసుకుని గురువుగారి దగ్గర సెలవు తీసుకున్నాను."

సూర్య చెప్పడం ఆపి మంచినీళ్ళు తాగి, "ఇక్కడ నుంచి మరోకథ మొదలు. అది రేపు చెబుతాను" అన్నాడు.

నా ఆత్రుత ఆపుకుని సరే అన్నాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS